పీహెచ్‌సీల్లో కార్పొరేట్ వైద్యం

- ఆధునిక పరికరాలు సమకూర్చిన గత ప్రభుత్వం
- అన్ని పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొలిమిగుండ్ల: ప్రజారోగ్యానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. గవర్నమెంట్ ఆసుపత్రులు అంటే డాక్టర్లు అందుబాటులో ఉండరు...మందులు ఉండవు, సౌకర్యాలు బాగాలేవనే మాటలకు స్వస్తి పలికింది. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ఫలితంగా పీహెచ్‌సీల్లోనూ కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయి. అయితే ప్రస్తుతం మారిన టీడీపీ ప్రభుత్వం ఇదేవిధంగా వైద్యసేవలు కొనసాగిస్తుందా... లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు సామాన్యులు. బనగానపల్లె నియోజకవర్గంలో ఏడు పీహెచ్‌సీలు ఉన్నాయి. గతంలో తక్కువ మంది సిబ్బంది ఉండేవారు. మాజీ సీఎం జగన్ ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బందిని నియమించారు. నాడు–నేడు పథకం కింద పీహెచ్‌సీల రూపురేఖలు మార్చివేసి పూర్తి స్థాయిలో వసతులు కల్పించారు. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను నియమించారు. ఒకరు గ్రామాలకు వెళ్లడంతో లేదా సెలవులో ఉంటే మరొకరు తప్పకుండా పీహెచ్‌సీలో ఉంటారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటంతో ఓపీ సేవలు రోజు రోజుకు పెరిగాయి కూడా. ప్రతి పీహెచ్‌సీలో రోజుకు 70కి పైగానే వైద్యం కోసం వస్తున్నారు. డబ్ల్యూహెచ్‌ఓ సర్టిఫై చేసిన క్వాలిటీ మందులను రోగులకు అందజేస్తున్నారు.


కొలిమిగుండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


ల్యాబ్‌లో ఆధునిక పరికరాలు

ఆధునిక పరికరాలు

కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉండే ఆధునిక వైద్య పరికరాలను ప్రభుత్వ పీహెచ్‌సీలకు మంజూరు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఒక్కో పీహెచ్‌సీకి రూ.20 లక్షలు విలువ చేసే సీబీసీ, ఎలక్ట్రోలైట్, ఎన్‌లైజర్, బయోకెమిస్ట్రీ ఎన్‌లైజర్, యూరిన్ ఎన్‌లైజర్, టీబీఆర్టీ పీఆర్ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో చాలా రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేవి కావు. దీంతో రోగులు పట్టణాలకు వెళ్లి ప్రవేట్ ఆసుపత్రులను ఆశ్రయించేవాళ్లు. ఇప్పుడు రోగులకు సులభంగా స్థానికంగా సేవలు అందుతున్నాయి. ఇప్పటి వరకు 20 రకాల వైద్య పరీక్షలు మాత్రమే చేసేవాళ్లు. ఆధునిక పరికరాలు సమకూర్చడంతో మొత్తం 65 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీలో ఉండే ల్యాబ్ టెక్నీషియన్‌కు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సీల్లో కార్పొరేట్‌కు దీటుగా 65 రకాల పరీక్షలు చేస్తున్నారు. అయితే వైద్య సేవలు, పరీక్షలు ప్రస్తుత పాలకులు కొనసాగిస్తారా.. లేదా అని గ్రామీణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


రక్త పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

రోగుల సంఖ్య పెరుగుతుంది



పీహెచ్‌సీలకు వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది, అందుబాటులో నాణ్యమైన మందులు ఉండటంతో వైద్యం కోసం వస్తున్నారు. పైగా ఆధునిక పరికరాలు మంజూరు కావడంతో త్వరగా రోగ నిర్ధారణ అవుతుంది. డెలివరీలు పెరుగుతున్నాయి. ప్రజలు పీహెచ్‌సీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

– నాగజ్యోతి, మెడికల్ ఆఫీసర్

పరిసరాల శుభ్రత పాటించాలి


స్టేషన్‌లో గడ్డిని స్వయంగా తొలగిస్తున్న సీఐ ప్రియతం రెడ్డి

బేతంచెర్ల: స్థానిక పోలీస్ స్టేషన్ పరిసరాల శుభ్రతకు పోలీసులు నడుం బిగించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు, గడ్డి పెరిగిపోవడంతో పోలీస్ సిబ్బందితో కలిసి స్వయంగా సీఐ ప్రియతం రెడ్డి గడ్డి కోసే యంత్రంతో తొలగించే పని చేపట్టారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు. పోలీస్ స్టేషన్‌కు తమ సమస్యల పరిష్కారానికి వచ్చిన ప్రజలు, పట్టణ వాసులు పోలీసుల తీరుపై హర్షం వ్యక్తం చేశారు.

స్ఫూర్తి సంస్థకు సేవారత్న అవార్డు

డోన్ టౌన్ : రక్తదానంతో విలువైన ప్రాణాలు కాపాడుతున్న స్ఫూర్తి సేవా సంస్థకు జిల్లా స్థాయిలో ఉత్తమ సేవారత్న అవార్డు దక్కింది. అంతర్జాతీయ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం కర్నూలు సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్ఫూర్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మధుతో పాటు సభ్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్ తదితరులు సత్కరించి అవార్డు అందజేసినట్లు శనివారం మధు తెలిపారు. ఈ సందర్భంగా స్ఫూర్తి సంస్థ సభ్యులకు పలువురు అభినందించారు.

క్లుప్తంగా

పాఠశాల తనిఖీ


ఎంపీపీ స్కూల్ విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న ఎంఈఓ ఈశ్వరయ్య

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంఈఓ2 ఈశ్వరయ్య శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. మెదటి విడత పాఠ్య పుస్తకాలు అందాయా లేదా అని ఆరా తీశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్త దానం చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక షాదిఖానాలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి దాతల నుండి విశేష స్పందన లభించింది. కర్నూలు బ్లడ్ బ్యాంక్, ప్రభుత్వ ఆసుపత్రి రక్త నిధి కేంద్రాల డాక్టర్లు హరి, కిరణ పర్యవేక్షణలో టెక్నీషియన్లు 70 మంది దాతలు నుంచి రక్తం సేకరించారు. రక్త దాతలను ముస్లిం మైనార్టీ సంఘం, డాక్టర్లు అభినందించారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల: ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు దస్తగిరి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఓ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ప్రలోభాల మూలంగా అధికారులు ప్రైవేట్ టీచర్ల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్


అన్న క్యాంటిన్‌ను పరిశీలిస్తున్న జయరామ్

డోన్ టౌన్ : పట్టణంలోని కేవీఎస్ కాలనీలోని అన్న క్యాంటీన్‌ను శనివారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్న క్యాంటిన్ పునః ప్రారంభంలో భాగంగా మున్సిపల్ ఏఈ సురేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపునున్నట్లు కమిషనర్ తెలిపారు.

సత్కారం


శివప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్ : పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పని చేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్న శివప్రసాద్‌ను శనివారం హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో తోటి ఉపాధ్యాయులు సత్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు షణ్ముర్తి, ఉపాధ్యాయులు శివప్రసాద్ దంపతులను సన్మానించి మెమొంటో అందజేశారు.

నేటి నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో ఈనెల 16 నుంచి నుండి 22వ తేదీ వరకు శ్రీ జ్ఞానప్రసాద్ గురూజీ ప్రవచనాలు వినిపిస్తారని నిర్వాహకులు తిమ్మయ్య, రామకృష్ణ తెలిపారు. శనివారం ఈ మేరకు ఆలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ప్రవచనాలు 16వ తేదీ ఆదివారం సాయంత్రం 6 నుంచి 8గంటల వరకు సప్తాః జ్ఞాన యజ్ఞం ప్రవచనాలను వినిపిస్తారని, అలాగే 22వ తేదీ సాయంత్రం వరకు ప్రచనాలు వినిపిస్తారని చెప్పారు.

ఘనంగా అయ్యప్ప జన్మనక్షత్ర పూజలు

ఆళ్లగడ్డ: స్వామియే శరణం అయ్యప్ప .. అనే శరణుఘోషతో పట్టణ శివారులోని అయ్యప్ప ఆలయ నిర్మాణం ప్రాంతం మార్మోగింది. పట్టణ శివారులోని కాచింతల సమీపంలోని ఉత్తర శబరి మల అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం స్వామి జన్మ నక్షత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే మూలమూర్తికి అష్ట దవ్య ఫల అభిషేకం, అర్చనలు చేసి నూతన పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

కాటసాని నాగార్జునరెడ్డికి నివాళి

బనగానపల్లె రూరల్ : మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్ద కుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి ఆరవ వర్ధంతిని శనివారం కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అవుకు రోడ్డులో శ్రీషిరిడీ సాయినాథ్ ఆలయ సమీపానున్న దివంగత కాటసాని నాగార్జునరెడ్డి ఘాట్ వద్ద మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు, బంధువులు, స్నేహితులు, అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. ఇప్పటికే బనగానపల్లె వంద పడకల ప్రభుత్వ వైద్యశాలలో వెంటిలేటర్‌తో కూడిన ఉచిత అంబులెన్స్ ఏర్పాటు, కోవెలకుంట్ల పట్టణంలో మానవత స్వచ్ఛంద సేవ సంస్థకు బొలెరో వాహనం అందించామన్నారు. అదేవిధంగా బనగానపల్లె పట్టణంలో షియా మతస్తులకు రూ.40 లక్షల సొంత నిధులతో ఇబాదత్‌ఖానా ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. అలాగే ఉన్నత చదువులు అభ్యసించే పేద విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నాగార్జున చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.


దివంగత కాటసాని నాగార్జునరెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కాటసాని రామిరెడ్డి దంపతులు

చెరువు భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు

ప్యాపిలి: పట్టణ సమీపంలోని నాయిన్‌చెర్వు భూములు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం ప్యాపిలికి వచ్చిన ఆయన నాయిన్ చెర్వును పరిశీలించారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకుల ద్వారా సమస్యను అడిగి తెలుసుకున్నారు. చెరువు సమీపంలో వేసుకున్న లేఅవుట్ స్థలాన్ని, చెరువును సర్వే చేయాల్సిందిగా అధికారులను ఆదేశిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు యాదవ్, తొప్పెల శ్రీనివాసులు, రామసుబ్బయ్య, ఖాజాపీర్, నాగేంద్ర, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గోరుకల్లు రిజర్వాయర్ పరిశీలన

బేతంచెర్ల: పాణ్యం మండలంలోని గోరుకల్లు రిజర్వాయర్‌ను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అదేవిధంగా గోరుకల్లు రిజర్వాయర్ వద్ద ఉన్న ఇన్‌టెక్ వెల్‌ను, బేతంచెర్ల మండలంలోని బుగ్గానిపల్లె తాండ వద్ద ఉన్న ట్రీట్మెంట్ ప్లాంట్ నీటి శుద్ధికరణను ఆయన పరిశీలించారు. బేతంచెర్ల మండలంలోని గ్రామాలకు ఆగస్టు చివరి నాటికి, డోన్, ప్యాపిలి మండలాలకు ఈ ఏడాది చివరికి తాగునీరు అందించేందుకు పనులు వేగవంతం చేయాలని కోట్ల సూచించారు. కార్యక్రమంలో బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, ఏఈలు పాల్గొన్నారు.


చెరువు వద్ద వేసిన లేఅవుట్ గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల

మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి ఘన స్వాగతం

బనగానపల్లె రూరల్ : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా బీసీ జనార్ధన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక మొదటిసారిగా శనివారం బనగానపల్లె చేరుకోవడంతో టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పెట్రోల్ బంక్ కూడలిలో ప్రజలను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. గతంలో చెప్పిన మేరకు పేదలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.


ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణంలోని 32 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని జలదుర్గం, మల్కాపురం బ్రేకర్ల అత్యవసర మరమత్తుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. డోన్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్, మల్కాపురం , రంగాపురం, జలదుర్గం సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు కరెంటు ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.


సద్దలవెంగన్న చెరువులో స్వల్పంగా ఉన్న నీరు

విస్తారంగా వర్షాలు... పెరగని భూగర్భ జలాలు

కొలిమిగుండ్ల: నైరుతి రుతుపవనాల రాకతో జూన్ ప్రారంభం నుంచే వర్షాలు విస్తారంగా కురిశాయి. సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ నమోదైనప్పటికీ భూగర్భ జలాలు అంతంత మాత్రంగానే పెరిగాయి. కొలిమిగుండ్ల– నాయినపల్లె గ్రామాల మధ్యనున్న సద్దలవెంగన్న చెరువు, తిమ్మనాయినపేట, హనుమంతు గుండం చిన్న,పెద్ద చెరువుల్లో నీళ్ల స్వల్పంగానే ఉన్నాయి. జూన్‌లో సాధారణ వర్షపాతం 68.4 మి.మీ కాగా ఇప్పటి వరకు అత్యధికంగా 169.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మెట్ట రైతుల్లో ఆనందం నెలకొంది. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే చాలా గ్రామాల్లో వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు నామమాత్రంగా పెరిగాయి.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తంగమణి


డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలతో సమావేశమైన జడ్జి తంగమణి

డోన్ టౌన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం కమిషనర్ డాక్టర్ జయరామ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఘనవ్యర్థాల నిర్వాహనపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతితో కలిసి ఆమె ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంధ సంస్థల సభ్యులు పర్యావరణ పరిరక్షణపై ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. ఘనవ్యర్థాల నిర్వాహన 2016 చట్టం ప్రకారం చెత్తను తడి,పోడి చెత్తగా వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. చెత్తను ఇష్టానుసారంగా పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వ్యాపారస్తులు కూడా తమ దుకాణాల వద్ద ఇష్టానుసారంగా వ్యర్థపదార్థాలను పారవేయ కూడదని, ప్లాస్టిక్ సంచుల వినియోగం పూర్తిగా నిషేధించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పట్టణ పరిశుభ్రత కోసం పాటుపడుతున్న పారిశుద్ధ్య కార్మికులను ఈ సందర్భంగా జడ్జి అభినందించారు. సమావేశంలో సామాజిక కార్యకర్తలు మహ్మద్ రఫీ, ఏఈ నాగరాజు, స్ఫూర్తి సేవా సంస్థ వ్యవస్థాపకులు సీసంగుంతల మధు, మున్సిపల్ ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

డోన్ టౌన్ : స్థానిక కోర్టు ఆవరణలో జూన్ 29వ తేదీ జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి పిలుపునిచ్చారు. స్థానిక కోర్టు ఆవరణంలో ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిలతో కలిసి ఆమె శనివారం డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, వాటిలో రాజీ అయ్యే పరిస్థితులు, కక్షిదారుల గురించి వివరాలు సేకరించారు. కక్షిదారులకు లోక్ అదాలత్ ప్రయోజనాలు వివరిస్తూ వారి కేసులను పరిష్కరించుకునేందుకు రాజీ మార్గాలు సూచిస్తూ వారిని చైతన్యం పరచాలని ఈ సందర్భంగా జడ్జి పోలీసులకు సూచించారు. సమావేశంలో పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్, అస్రత్‌బాషా, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, కోర్టు సిబ్బంది కళ్యాణి, సరిత పాల్గొన్నారు.

ముగిసిన పండరీ భాగవత ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోటావీధిలో వెలసిన శ్రీరమా సమేత సత్యనారాయణ దేవస్థానంలో డాక్టర్ దీవీ హయగ్రీవాచారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండరీ భాగవత ప్రవచనాలు శనివారం ముగిశాయి. ఆయన పండరీనాథుడి వైశిష్ఠం గురించి భక్తులకు వివరించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహకులు అయిన గోపాలయ్య, రామ్మూర్తి..కుటుంబ సభ్యులను ఆలయ చైర్మన్, ఈఓలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ నాగప్రసాద్, దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి పాల్గొన్నారు.

క్రీడా భారతి ఆంధ్రప్రదేశ్ కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా క్రీడా భారతి ఆంధ్రప్రదేశ్ కమిటీని శనివారం రామ కృష్ణారెడ్డి అధ్యక్షతన పరిశీలకులు సురేంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్షేత్రస్థాయి ప్రముఖ చంద్రశేఖర్ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా శాంతినికేతన్ స్కూల్ చైర్మన్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా నిమ్మకాయల సుధాకర్‌తో పాటు ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశాన్ని ఒలంపిక్స్‌లో ముందుంచాలనే లక్ష్యంతో క్రీడా భారతి ఆవిర్భవించిందన్నారు. నంద్యాల జిల్లాలో క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఇక్కడి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించారని, నూతనంగా ఎన్నికైన సుధాకర్ అన్నారు.


టెంకాయ వేస్తున్న దృశ్యం

వర్షం పడింది... సందడి రోడ్డెక్కింది!


ఒలిచిన టెంకాయను విసురుతున్న దృశ్యం


టెంకాయ పగలగొడుతున్న యువకుడు

సంజామల : ఖరీఫ్ సీజన్ జూన్ 1 నుంచి ప్రారంభవ్వగా వరుణుడు సైతం కరుణించాడు. విస్తారంగా వర్షాలు కురిశాయి. ఎడతెరిపలేకుండా వర్షాలు కురువడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. సాగుకు అదునైన పదును కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు సైతం ఇళ్లకే పరిమితమయ్యారు. మూడు రోజులుగా వర్షాలు నిలిచిపోవడంతో చావిళ్లు, బస్టాండ్ తదితర కూడళ్లలో సరదాగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో యువత గ్రామీణ క్రీడలకు తెరలేపారు. మండల పరిధిలోని ఆకుమల్లలో వర్షం పడింది... సందడి రోడ్డెక్కింది అన్నట్లుగా యువత వివిధ పందేలు జోరుగా కాస్తున్నారు. తొక్కతీయని టెంకాయ పగలగొట్టడం, టెంకాయను విసరడం, నిమ్మకాయ విసిరడం, కొబ్బరి చిప్ప విసరడం తదితర పందేలు జోరుగా సాగాయి. ఇరు వర్గాల మధ్య పందేలు కాస్తూ గ్రామీణ యవత కేరింతలు కొడుతున్నారు.

తల్లిదండ్రుల ఆకాంక్ష నెరవేర్చాలి


అసోసియేట్ డీన్ డాక్టర్ జయలక్ష్మిని సత్కరిస్తున్న ఈఓ, ప్రొఫెసర్లు

మహానంది: తాము పడిన కష్టాలు పిల్లలు పడొద్దని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, వారి ఆకాంక్షను నెరవేర్చాలని మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో శనివారం రాత్రి హాస్టల్ డే నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కాలానికి అనుగుణంగా విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా నూతన వంగడాలపై దృష్టి సారించాలని సూచించారు. వేడుకల్లో విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి, రిటైర్డ్ ఏడీ నరసింహారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.